క్లుప్తంగా

తిరుమల బాలాజీకి పట్టువస్త్రాల సమర్పణ



ట్రస్ట్ సభ్యులకు పట్టు వస్త్రాలను అందజేస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామికి భక్తులు పట్టు వస్త్రాలను సమర్పించారు. గురువారం సాయంత్రం షీలానగర్‌కు చెందిన బాలసత్య అప్పల త్రిమూర్తులు, రాజేశ్వరి దంపతులు, పార్వతి, ప్రమీలారాణి రెండు పట్టు పంచెలు, నాలుగు పట్టు చీరలను దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గోపాలపట్నం: ఆర్ఆర్‌వీ పురం సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాపూజీనగర్, టైలర్స్ కాలనీ, ప్రశాంతినగర్, గోపాలపట్నం బంక్ ఏరియా, ఇందిరానగర్, నరసింహనగర్, గణేష్‌నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

నేడు శ్రీరామ పాదుకల దర్శనం

పెదగంట్యాడ: అయోధ్య శ్రీరామ పాదుకల భారతదేశ సందర్శన యాత్రలో భాగంగా శ్రీరాముని పాదుకలను 76వ వార్డు హెచ్‌బీ కాలనీ సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో శుక్రవారం ప్రదర్శించనున్నారు. అయోధ్య భాగ్యనగర శ్రీ సీతారామ సేవా ఫౌండేషన్ ప్రతినిధి చల్లా శ్రీనివాస్ శాస్త్రి పర్యవేక్షణలో సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఆలయంలో పాదుకల ప్రదర్శన ఉంటుంది. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి దర్శించుకోవాలని ఆలయ కమిటీ ప్రతినిధులు ఎం.త్రిమూర్తులు, కొల్లా అప్పలరాజు, ముత్యాలశెట్టి, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు కోరారు.

బాలికా విద్యతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ

విశాఖ లీగల్: బాలికా విద్యతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అన్నారు. గురువారం ఆమె పాత పోస్టాఫీసు వద్ద ఉన్న క్వీన్‌మేరీ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. సంపదను దోచుకెళ్లొచ్చు కానీ చదువును ఎవరూ దోచుకెళ్లలేరని చెప్పారు. ఎంత చదివితే అంత విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. బాలికలకు చదువుతోపాటు ఆటలు, వ్యాయామం కూడా ముఖ్యమన్నారు.

విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: శ్రీ పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 15 వరకు నిర్వహించనున్న జిల్లాస్థాయి విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పోటీలను నిర్వహించడం హర్షణీయమన్నారు. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేత జట్లకు వరుసగా రూ.20వేలు, రూ.12వేలు, రూ.8వేల నగదు బహుమతిని అందిస్తారని చెప్పారు.

ప్రజల చెంతకే 'సంపూర్ణ ఆరోగ్యం'

- ఇక నుంచి గర్భిణులు, బాలింతల ఇంటికే రేషన్ సరకులు
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ కిట్ల పంపిణీ
- పారిశ్రామిక ప్రాంతంలో టేక్ హోం రేషన్ పంపిణీకి శ్రీకారం
- డ్రై రేషన్ అందుకున్న గర్భిణులు, బాలింతలు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న 62వ వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: ఆరోగ్యవంతమైన భావితరాల కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమం పారిశ్రామిక ప్రాంతంలో గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. డ్రై రేషన్ కింద అందించే సరుకుల నాణ్యతను నిరంతరం సమీక్షిస్తూ ఎప్పటికప్పుడు పరీక్షించాలని అధికారులను ఆదేశించిన సీఎం జగన్ ఇకపై గర్భిణులు, బాలింతల ఇంటికే రేషన్ సరకులు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు.

భావితరాల కోసం ఖర్చుకు వెనకాడకుండా..

40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు వార్డు పరిధి ఏకేసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వరపల మహేష్, సచివాలయ మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి గౌసియా, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, వరలక్ష్మి, కన్వీనర్ బాలకృష్ణ, గృహసారథులు, బైరాగి, సురేష్, బాలింతలు, గర్భిణులు తదితరుల పాల్గొన్నారు.

58వ వార్డులో డ్రై రేషన్ కిట్లు పంపిణీ

జీవీఎంసీ 58వ వార్డు పరిధి ములగాడలో వార్డు కార్పొరేటర్, టౌన్ ప్లానింగ్ చైర్మన్ గులివిందల లావణ్య ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గిలివిందల కృష్ణ, ఐసీడీసీ సూపర్‌వైజర్ వేణుగోపాలరెడ్డి, పెద్దాడ రమణ, కృష్ణమూర్తి, జగన్నాథం అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో..

జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలో వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు చేతుల మీదుగా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బల్ల భారతి, జె.అర్చనకుమారి, పద్మకుమారి, విద్యాలత, యశోద, హేమ, సునీత, సత్యనారాయణ, కనకరాజు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



58వ వార్డు కార్పొరేటర్ లావణ్య ఆధ్వర్యంలో..

63వ వార్డులో..

జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు పుక్కల కృష్ణ, బోండా కృష్ణ, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

రాష్ట్రంలోని మహిళల ఆరోగ్యానికి సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి అన్నారు. ఈ మేరకు వార్డు పరిధిలోని చింతల్లోవ, కాకరలోవ, క్రాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్, సూరాడ పెంటారావు, రమణమూర్తి, యలగాడ రాజు, కుమార్, నరసింహారెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహార కిట్లు అందించారు.



63వ వార్డు ఇన్‌చార్జి రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో..



63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా ఆధ్వర్యంలో..

సబ్సిడీ టమాటాకు డిమాండ్



మర్రిపాలెం రైతుబజార్‌లో టమాటాల కోసం క్యూలో వేచి ఉన్న మహిళలు



ఆధార్ వివరాలు సేకరించి సబ్సిడీ టమాటాలు విక్రయిస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం, మర్రిపాలెం రైతుబజార్లలో సబ్సిడీ టమాటాలకు గిరాకీ పెరిగింది. టమాటా కౌంటర్ల వద్ద భారీ క్యూలైన్లు ఏర్పాడ్డాయి. గురువారం గోపాలపట్నం రైతుబజార్‌కు 2,500 కిలోలు, మర్రిపాలెం రైతుబజార్‌కు 1,400 కిలోల టమాటాలు వచ్చాయి. బయట మార్కెట్‌లో కిలో ధర రూ.180 ఉండటం, వారం రోజుల తరువాత రాయితీ టమాటా రావడంతో అధిక సంఖ్యలో జనం తరలివచ్చి బారులుతీరి మరీ కొనుగోలు చేశారు. ఉదయం 11 గంటలకే స్టాళ్లన్నీ ఖాళీ అయిపోయాయి.

కంచరపాలెం రైతుబజార్‌లో..

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌లో సబ్సిడీ టమాటా కోసం వినియోగదారులు బారులు తీశారు. ఇక్కడ రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ఉదయం 6 గంటల నుంచి కిలో టమాటా రూ.50కు రాయితీపై విక్రయించారు. సుమారు 16 క్వింటాళ్ల టమాటాను విక్రయించినట్లు రైతుబజార్ ఈవో కృష్ణమోహన్ తెలిపారు.

91వ వార్డులో పింఛన్ల పంపిణీ

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు చిన్నబుచ్చిరాజుపాలెం, ఎస్సీ కాలనీల్లో పలువురికి పింఛన్లు అందించారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఇక్కడి ఆరుగురికి పింఛన్లు అందని విషయం వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి స్థానిక నేతలు తీసుకెళ్లారు. దీంతో ఆనంద్‌కుమార్ తన సొంత నిధుల నుంచి ఆరుగురికి పింఛన్లు సమకూర్చారు. వాటిని 91, 92 వార్డుల పార్టీ అధ్యక్షులు అప్పలస్వామి, గుణిశెట్టి శ్రీనివాసరావు అందించారు. ఈ కార్యక్రమంలో దేరెడ్ల సత్యనారాయణ, చుక్క పైడిరాజురెడ్డి, తంబి రెడ్డి, పి. రమణ, శ్రీలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ బాలుడికి పింఛన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన

సింథియా: దేశవ్యాప్తంగా జాతీయ పెన్షన్ పథకం(ఎన్‌పీఎస్)ను వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో గురువారం విజయనగర్ గేటు వద్ద వివిధ యూనియన్ల కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, హెచ్ఆర్ఏతో కలిపి ఓటీని లెక్కకట్టాలని, కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించాలని, రిక్రూట్‌మెంట్ జరిపి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జీవిత చరమాంకంలో కార్మికులకు భద్రత కల్పించే ఎన్‌పీఎస్‌ను 2004 తరువాత ఉద్యోగంలో చేరిన వారికి వర్తింపజేయాలని, ఫ్యాక్టరీస్ యాక్ట్ ప్రకారం అన్ని అలవెన్సులు ఇవ్వాలని కోరారు.



నిరసన తెలుపుతున్న యూనియన్ కార్మికులు

ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధి 54వ వార్డు జ్యోతినగర్‌లో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. జీవీఎంసీ స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా జోన్–5కు సంబంధించి రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్(ఆర్ఆర్ఆర్) సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. పనికిరాని వస్తువులను తిరిగి ఉపయోగించేలా ప్రజలకు ఈ సెంటర్‌లో అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం సెంటర్‌లో ప్రదర్శించిన వేస్ట్ మెటీరియల్‌తో చేసిన వస్తువులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, కార్పొరేటర్ చల్లా రజిని, చల్లా ఈశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ జనార్దన్, వార్డు శానిటరీ సెక్రటరీ నాయుడు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, హెల్త్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కార్మికుల పోరాటానికి కేంద్రం తలవంచాల్సిందే..

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం కార్మిక వర్గం చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 903వ రోజు గురువారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. బీజేపీ నాయకులు గత ప్రభుత్వ స్కామ్‌ల గురించి గగ్గోలు పెట్టి, అధికారంలోకి రాగానే తమ అనుయాయులైన ఆదానీ, అంబానీలకు కారుచౌకగా ప్రజాసంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. దేశంలో కొత్త పరిశ్రమలను నెలకొల్పకపోగా, ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం సరికాదన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగుతుందని ప్రకటన చేయాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



903వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

నిత్యపారాయణ గ్రంథం భాగవతం

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న ఆధ్యాత్మిక లహరి ప్రవచనాల్లో భాగంగా గురువారం సాయంత్రం భాగవతం భక్తితత్వం అనే అంశంపై కవి, సహృదయ సాహితి సంస్థ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ ప్రసంగించారు. మానవులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించే దారి, దీపంగా భాగవతాన్ని అభివర్ణించారు. భాగవతంలోని నవ విధ భక్తి మార్గాలను ప్రస్తావించి జీవితాన్ని ఎలా మలుచుకోవాలో మార్గదర్శనం చేస్తుందని ఆయన అన్నారు. అనంతరం లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. భాగవత పురాణం నిత్య పారాయణ గ్రంథమని పేర్కొన్నారు. ముఖ్య అతిథి నారాయణనంద భారతీస్వామి ప్రారంభ వాక్యాలు పలికారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ప్రసంగకర్తను సన్మానించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న శేఖరమంత్రి ప్రభాకర్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

సింథియా: మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధి యారాడ బస్‌స్టాప్ వద్ద గురువారం తెల్లవారుజాము 4 గంటలకు రెండు ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్న 1,050 కేజీల రేషన్ బియ్యాన్ని మల్కాపురం పోలీసులు పట్టుకున్నారు. సీఐ జి.దేముడుబాబు ఆధ్వర్యంలో క్రైం ఎస్ఐ పి.డి.బి.శంకర్, సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. రెండు ఆటోల్లో సుమారు 1,050 కేజీల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించడాన్ని గుర్తించారు. ఆటోలను, సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన రేషన్ బియ్యంతో సహా రెండు ఆటోలను మల్కాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడిన రేషన్ బియ్యం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సింథియా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ తెలిపారు. వార్డులోని వెంకన్నపాలెంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి స్థల పరిశీలన నిమిత్తం గురువారం విస్తృతంగా ఆమె పర్యటించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచనల మేరకు డ్రైనేజీ, రక్షణ గోడలు, సామాజిక భవనం ఏర్పాటు, తాగునీరు, వీధిలైట్లు వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికను పంపామని కార్పొరేటర్ చెప్పారు. వార్డులో పలు అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వార్డు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పర్యటించి అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో ఉరుకూటి చిన్నారావు, నేలతి అప్పారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రయాణికుల పాట్లు

తాటిచెట్లపాలెం: రైళ్లలో ప్రయాణించే సాధారణ ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైల్లో నిల్చోలేరు..కూర్చోలేరు. కనీసం మరుగుదొడ్లకు, మూత్రవిసర్జనకు కూడా వీలులేని పరిస్థితి. గురువారం భాగల్‌పూర్ నుంచి బెంగళూరు వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గురువారం మధ్యాహ్నం విశాఖ చేరుకుంది. అంతే అప్పటివరకు ఎంతో ఓపిగ్గా ఎదురు చూసిన సాధారణ ప్రయాణికులు ఒకరివెంట ఒకరు రైలు దిగి ట్రాక్‌ల వెంబడి మూత్రవిసర్జన కోసం పరుగులు తీశారు. ట్రాక్‌లపై మూత్రవిసర్జన చేయడం ప్రమాదం, నేరం అని తెలిసి కూడా వేరే దారి లేక బోగీల్లో బాత్రూంలోకి ప్రవేశించడానికి అవకాశం లేక ఇలా చేయడం రైల్వే అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించినట్టు అయింది.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో ఓటర్ల సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 21 నుంచి ఇప్పటివరకు నిర్వహించిన డోర్ టు డోర్ సర్వే ప్రగతిని ఈ సందర్భంగా వివరించారు. ఈ సర్వేలో గుర్తించిన డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, చనిపోయిన వారి వివరాలతో పాటు అర్హుల వివరాలతో కూడిన జాబితాలను నాయకులకు అందజేశారు. ఫారం 6, 7, 8లను దరఖాస్తు చేసే విధానంపై అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీలనుంచే ఇప్పటివరకు బీఎల్ఏల జాబితాను అందించారని, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నాయకులు కూడా తమ బీఎల్ఏల జాబితాలను అందజేయాలని కోరారు. వలంటీర్లను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఈఈ ప్రసాద్‌బాబు, టౌన్‌ప్లానింగ్ డీసీపీ పద్మజ, ఏసీపీ మహాపాత్రో, గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు పాల్ కిరణ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

మురళీనగర్‌కు అయోధ్య శ్రీరామ పాదుకలు

మురళీనగర్: మురళీనగర్ సీతారామ ఆలయంలో అయోధ్య శ్రీరామ పాదుకలకు గురువారం ఆలయ ప్రధాన కార్యదర్శి సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అయోధ్య భాగ్యనగర్ శ్రీసీతారామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సందర్శనలో భాగంగా గురువారం ఈ పాదుకలు మురళీనగర్ సీతారామాలయానికి చేరుకున్నాయి. వీటికి ఆలయ పండితులు పూర్ణకుంభం నడుమ స్వాగతం పలికారు. పాదుకలకు భక్తులు క్షీరాభిషేకం, విశేష పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆయల అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పాదుకలకు ఆహ్వానం పలుకుతున్న రామాలయ కమిటీ సభ్యులు

ఉక్కు ఉద్యోగులకు వేతన ఒప్పందం చేయాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారులు, కార్మికులకు వెంటనే వేతన ఒప్పందం చేయాలని బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ తీర్మానం చేసింది. స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఫెడరేషన్ సమావేశంలో గురువారం రెండు తీర్మానాలు చేశారు. అసంతృప్తితో ఉన్న ఉద్యోగులకు వేతన ఒప్పందం చేయాలని, సుమారు 20 ఏళ్లుగా అన్‌స్కిల్డ్‌గా ఉండి, సాంకేతిక అర్హత ఉన్న కాంట్రాక్ట్ కార్మికులకు స్కిల్డ్ కార్మికులుగా పదోన్నతి కల్పించాలని తీర్మానాలు చేశారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించి ప్రత్యామ్నాయంగా సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. ఈ తీర్మానాలను కేంద్ర ఉక్కు మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు పంపుతామని స్టీల్ బీఎంఎస్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రాజ్ బిహారీ శర్మ, ఉప ప్రధానకార్యదర్శి సురేంద్ర కుమార్ పాండే, నాయకులు ఎం.వి.ఎస్. నాయుడు, రాందాస్ నరేంద్ర, హనుమంతరావు, శ్రీనివాసరెడ్డి, శేషు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సీఐ కౌన్సెలింగ్

కూర్మన్నపాలెం: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని, సత్ప్రవర్తనతో మెలగాలని దువ్వాడ శాంతిభద్రతల సీఐ శ్రీనివాసరావు సూచించారు. దువ్వాడ రైల్వేస్టేషన్ 4వ ప్లాట్‌ఫాం వైపు ఉన్న ఆటో డ్రైవర్లు ఆర్టీసీ డ్రైవర్‌ను తీవ్ర పదజాలంతో దూషించిన సంఘటనపై స్పందించిన ఆయన ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆర్టీసీ బస్సులకు, ఇతర వాహనాలకు ఇబ్బంది లేకుండా ఆటోలను నడపాలని తెలిపారు. ఆటోలను ఎక్కడ పడితే అక్కడ నిలిపి, ఇతరులకు అంతరాయం కలిగించకూడదన్నారు.



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న దువ్వాడ సీఐ శ్రీనివాసరావు

పేదల గృహ నిర్మాణాలకు విశాఖ ఉక్కు వినియోగించాలని వినతి

ఉక్కునగరం: రాష్ట్రంలో చేపడుతున్న పేదల గృహ నిర్మాణాలకు, సెంటు భూమి ఇళ్లకు విశాఖ ఉక్కు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్‌ను కోరారు. వారు మంత్రిని గురువారం అమరావతిలో కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వర్కింగ్ క్యాపిటల్ లేకపోవడం వల్ల 16 నెలలుగా 20 లక్షల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఒక బ్లాస్ట్‌ఫర్నేస్‌ను, సంబంధిత విభాగాలను మూసి వేశారని తెలిపారు. తద్వారా 40 శాతం పైగా ఉత్పత్తి తగ్గిందని, అందువల్ల ఉత్పత్తి వ్యయం పెరిగి నష్టాలు ఎదుర్కోవలసి వస్తోందని చెప్పారు. పూర్తి స్థాయి ప్లాంట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం రెండు వేల కోట్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. దానికి బదులుగా ప్రభుత్వ నిర్మాణాలకు విశాఖ ఉక్కును వినియోగిస్తే స్టీల్‌ప్లాంట్‌కు మేలు చేసిన వారవుతారన్నారు. కార్యక్రమంలో సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, సంయుక్త కార్యదర్శి నరసింహ, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'మిస్ ప్రీ టీన్' విజేత ప్రీతి పట్నాయక్

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ 2023 మిస్ ప్రీ టీన్ విజేతగా షీలానగర్‌కు చెందిన ప్రీతి పట్నాయక్ (12) నిలిచింది. విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్లో స్టార్ కిడ్స్ 2023, స్టార్ ఏపీ 2023 ఫ్యాషన్ షో నిర్వహించారు. ఫైనల్‌లో పరిచయం, సంప్రదాయం, నటన విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన ప్రీతి పట్నాయక్ ప్రీ టీన్ ఏపీగా టైటిల్ సాధించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిగ్ బాస్ ఫేం అనిల్ రాథోడ్ హాజరు కాగా, న్యాయ నిర్ణేతలుగా మిస్టర్ ఒలింపియాడ్ అరుణ్ పాల్, మిస్ ఇండియా 2022 వ్యవహరించారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా క్రౌన్, ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6 ప్రాంతాల్లో నిర్వహించిన ఆడిషన్లలో 5వేల మందికి పైగా పాల్గొనగా, 68మంది తుది పోటీలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. వారికి నగరంలో ఫైనల్స్ నిర్వహించినట్లు చెప్పారు. తమ కుమార్తె మిస్ ప్రీ టీన్‌గా ఎంపిక కావడంతో తల్లిదండ్రులు అనిత, జి.జి. ప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు.



మిస్ ప్రీ టీన్‌గా నిలిచిన ప్రీతి పట్నాయక్